## క్లుప్తంగా

### అభాగ్యుడికి వైద్య సేవలు..



చికిత్స పొంది డిశ్చార్జి అయిన తర్వాత అమరేష్

దాబాగార్డెన్స్ : ఓ అభాగ్యుడు. పేరు తెలియదు. ఊరు ఎక్కడో? మాట్లాడడం లేదు. వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటాయి. గెడ్డం పెరిగి.. చూడడానికి భయంకరంగా ఉన్నాడు. గత కొంత కాలంగా నగరంలోని సంగం శరత్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పైనే ఉంటున్నాడు. ఎవరో కాసింత ముద్ద పెడితే తిని నిద్రిస్తున్నాడు. సమీపంలో గల ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది వారం రోజులుగా ఆ అభాగ్యుడ్ని గమనించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న రెస్క్యూ నిర్వహించి ప్రభుత్వ మానసిక వైద్యశాల (మెంటల్ ఆసుపత్రి)కు తరలించారు. అక్కడ మంచి వైద్యం అందించారు. రికవరీ అయ్యాడు. పేరు అమరేష్ అని చెప్పాడు. పూర్తిగా మానసిక వ్యాధి నుంచి కోలుకున్న అమరేష్‌ను డిశ్చార్జి చేశారు. కాంప్లెక్స్ సమీపాన గల ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

### ఏపీ పీజీసెట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల సత్తా

దాబాగార్డెన్స్ : ఏపీ పీజీ సెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ పది లోపు 19 ర్యాంకులు, వందలోపు 93 మంది ర్యాంకులు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ సాధించారని పేర్కొన్నారు. జీవశాస్త్ర విభాగంలో ప్రథమ ర్యాంకు, గణిత శాస్త్ర విభాగంలో ప్రథమ ర్యాంకుతో పాటు 3, 5, 7 ర్యాంకులు, భౌతిక శాస్త్ర విభాగంలో 2, 8 ర్యాంకులు, రసాయన శాస్త్ర విభాగంలో 2,8,9,10 ర్యాంకులు, గణాంక శాస్త్ర విభాగంలో 7, 9 ర్యాంకులు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 3, 7,9,10 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 4,5 ర్యాంకులను ఆదిత్య విద్యార్థులు కైవసం చేసుకుని రికార్డు సాధించారని తెలిపారు.

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతులు ఇస్తున్న పూజారమ్మ విజయమ్మ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకున్నారు. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో కొలువైన కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.




# వ్యాధుల కాలం..జర భద్రం

- భయపెడుతున్న మలేరియా, టైఫాయిడ్, డయేరియా
- అప్రమత్తతతోనే రుగ్మతలను పారదోలాలని వైద్యుల సూచన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



పలు వ్యాధులకు కారణమయ్యే దోమ

దాబాగార్డెన్స్ : వర్షాకాలం వచ్చేసింది. ఈ సమయంలో వాతావరణ మార్పుల వల్ల సంభవించే సాధారణ వ్యాధులతో పాటు కలుషిత నీరు, అపారిశుధ్యం వల్ల పలు వ్యాధులు దాడి చేస్తాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే కాలమిది. దోమల వల్ల వ్యాపించే విషజ్వరాలు, నీటి కాలుష్యం వల్ల సంభవించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

**వర్షాకాలంలో వచ్చే వ్యాధులు..**

**మలేరియా:** దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల్లో మలేరియా ఒకటి. ఈ జ్వరానికి కారణం ప్లాస్మోడియం అనే సూక్ష్మజీవి. రోగి శరీరంలో ఈ సూక్ష్మజీవులుంటాయి. అనాఫిలిస్ జాతికి చెందిన ఆడ దోమ ఈ రోగిని కుట్టి రక్తంతో పాటు సూక్ష్మ జీవులను కూడా పీల్చుకుంటుంది. అలాంటి దోమ ఇతర ఆరోగ్యవంతులను మళ్లీ కుట్టినప్పుడు వారికి సంక్రమిస్తుంది. ఈ దోమ మురుగుకాల్వల్లోని మంచినీటిలో వృద్ధి చెందుతాయి.

**లక్షణాలివి:** దోమ కుట్టిన పది నుంచి 14 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్నిసార్లు వాంతులు కావడం జరుగుతుంది. జ్వరం వచ్చిన తొలిరోజే మలేరియా నిర్ధారించవచ్చు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**డెంగ్యూ :** నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. తన శరీరంలోకి డెంగ్యూ వైరస్ ప్రవేశించిన వారం రోజుల తర్వాత దీనిని మనుషులకు వ్యాపింపచేస్తుంది. ఇది కుట్టినప్పుడు నొప్పి ఉండదు. పగటిపూట ఎక్కువగా సంచరించే ఈ దోమ ఆ సమయంలోనే కుడుతుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, సిమెంటు, తారు రోడ్లపై నిలిచే నీరు, తాగేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, నీటి గాజులు, ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగ్యూ కారక దోమ వృద్ధి చెందుతుంది. దోమ కుట్టిన వారం రోజుల తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, కొందరిలో శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**డయేరియా..**

కలుషితనీరు, నిల్వ ఆహారం ద్వారా అతిసార వస్తుంది. రోగికి ఒక రోజులో 10 నుంచి 15 సార్లు నీళ్ల విరేచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువ అవుతాయి. రోజులో నాలుగు నుంచి ఐదు సార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. ఎక్కువ సార్లు విరేచనాలు కావడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గిపోయి రోగి షాక్‌లోకి వెళ్తాడు. రోగి త్వరగా డీ హైడ్రేషన్ దశకు చేరుతాడు. ఈ వ్యాధి ప్రభావం చిన్నారులు, మధుమేహరోగులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ఎక్కువగా ఉంటుంది.

**వైరల్ ఫీవర్ (విషజ్వరం):** వాతావరణంలో మార్పు, కొన్ని రకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ వస్తుంది. ఇంట్లో ఒకరికి విషజ్వరం వస్తే మిగిలిన కుటుంబ సభ్యులకు కూడా వచ్చే అవకాశం ఉంది. దీని ప్రభావం వారం నుంచి పది రోజుల పాటు ఉంటుంది. రోగికి 103 నుంచి 107 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది. గొంతునొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటినొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు కూడా అవుతాయి.

**తీసుకోవల్సిన జాగ్రత్తలు..**

- దోమల వల్ల ఎక్కువ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కనుక వాటి వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా నీరు, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- దోమతెరలు వాడాలి.
- కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఏదైనా తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు నీటితో శుభ్రంగా కడిగిన తర్వాత తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూత ఉండేలా చూడాలి.
- జలుబుకారక క్రిములను నివారించే సి విటమిన్ ఉన్న నిమ్మకాయ, బత్తాయి వంటివి తీసుకోవాలి.

### అప్రమత్తత అవసరం..



వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డయేరియా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత అవసరం. డయేరియా సోకిన రోగికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. లేదంటే వారు కూడా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. డయేరియా సోకిన వ్యక్తికి కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. లీటర్ నీటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కలిపి 3 నుంచి 4 గంటల వ్యవధిలో తాగించాలి. మంచి నీళ్లు కాచి చల్లార్చి తాగాలి. నిల్వ ఆహార పదార్థాలు తినకూడదు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

–ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ, జనరల్ మెడిసిన్

# సేవల్లో ఆదర్శం.. వలంటీర్ల వ్యవస్థ

జగదాంబ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వ్యవస్థ సేవల్లో ఆదర్శంగా నిలుస్తోంది. పేదలకు ప్రభుత్వ పథకాలను సవ్యంగా అందిస్తూ, ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను నేరుగా వారికే అందించే పనిని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నారు. ఇళ్లు, పెన్షన్లు, విద్య, వైద్యం, రేషన్ వంటి అనేక సౌకర్యాలు పేదలు సులువుగా పొందేలా తమ వంతు బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నారు.

### ఇంటికి వచ్చి పింఛను ఇస్తే మీకేంటి బాధ?



ఇన్నాళ్లు తిప్పించుకున్నారు. అరకొర పింఛను ఇచ్చారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పింఛన్లు పెంచారు. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇందులో మీకెంటి బాధ? సేవ చేసే వారిని తిట్టడం.. తప్పుగా మాట్లాడడం తగదు.

–సూర్యనారాయణ, ప్రసాద్‌గార్డెన్స్.

# మానవత్వానికి మెచ్చుతునక



సూర్యకాంతం పాడె మోస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ముక్సూద్ అహ్మద్

దాబాగార్డెన్స్ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న మడ్డి సూర్యకాంతం గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచం పట్టింది. ఆశ్రమవాసులు ఆమె చివరి మజిలీ వరకు సేవలందించారు. ఆరోగ్యం విషమించడంతో ఆదివారం మృత్యువాత పడింది. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ సూర్యకాంతం పార్థివ దేహానికి నివాళులర్పించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు ముక్సూద్ అహ్మద్ అమ్మ (సూర్యకాంతం) పాడె మోసి మానవత్వం చాటుకున్నారు. వారితో పాటు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు కూడా చివరి మజిలీలో పాల్గొని కాన్వెంట్ జంక్షన్ హిందూ స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మ అస్థికలు కాశీలో కలుపుతామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. సంస్థలో ఆశ్రయం పొందుతున్న వారు ఎవరూ అనాథలు కాదని..వారికి అండగా సంస్థతో పాటు ఎందరో ప్రముఖులు ఉన్నారని చెప్పారు. దహన సంస్కారంలో నల్ల రాజు, పైడిరాజు, అప్పలకొండ, దూడ నూకరాజు, కృష్ణమూర్తి, శ్రీరామ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలిత

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ సంఘాల నాయకులతో చర్చించి వారికి న్యాయం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. అసోసియేషన్ విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల సదస్సు ఆదివారం అల్లిపురంలో గల నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలకు పని చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం చేసేందుకు నిత్యం గ్రామీణ, పట్టణ నిరుపేద కుటుంబాలు, గర్భవతులు, బాలింతలకు, సున్నా నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ భారమై అప్పులు తెచ్చి కేంద్రాలు నిర్వహించాల్సిన స్థితి ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసోసియేషన్లను ఆహ్వానించి, చర్చించి మంచి వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విజయనగరం జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బేగం తదితరులు పాల్గొన్నారు.

**రెండు జిల్లాల నూతన కమిటీలు..**

సమావేశం అనంతరం విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసయ్యమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీతను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈగల అప్పలరాజు, అధ్యక్షురాలిగా రమణి, ఉపాధ్యక్షురాలిగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనకమహాలక్ష్మి, హైమావతి తదితరులను ఎన్నుకున్నారు.

# ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్



కాగితాలతో బొమ్మల తయారీని చూపిస్తున్న శ్రీకరుణ

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీ సెక్షన్‌లో ఆదివారం స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించారు. స్టోరీ టెల్లర్ శ్రీకరుణ ఆసక్తికరమైన కథలు వినిపించారు. 1 నుంచి 4 తరగతి విద్యార్థులు, ఆ తర్వాత 5 నుంచి 8 తరగతి విద్యార్థులకు వేర్వేరుగా కథలు చెప్పారు. అనంతరం కాగితాలతో బొమ్మల తయారీ(ఓరిగామి)పై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. బొమ్మల ద్వారా కథలు చెప్పారు. సుమారు 70 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ స్కూల్ కలిసి సంయుక్తంగా నిర్వహించాయి.

# 22 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమసదన్‌లో జరిగిన ఈ శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి ఎంవీపీ భజన మండలి కన్వీనర్ కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటుదాం

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ప్రతి రోజూ వాకింగ్ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. ఆదివారం వారంతా సమావేశమయ్యారు. సామాజిక బాధ్యతగా సభ్యులందరూ కలిసి ఉదయం 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే చక్కటి పర్యావరణం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, కార్యదర్శి వి.విఠల్ రావు, కోశాధికారి ఎం.తిలక్ పట్నాయక్, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

# ఓబీసీ జాబితాలోకి శిష్టకరణాల కోసం కృషి



ఆర్.కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బీచ్ రోడ్డు: శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేలా వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించేందుకు కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారు. నగరంలో ఉన్న కృష్ణయ్యను ఆదివారం ఏపీ శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, శిష్టకరణ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, వినతి పత్రం అందజేశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన ఆవశ్యకతను, ఇంత వరకు జరిగిన ప్రక్రియను, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ఎంపీకి వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఓబీసీలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. శిష్టకరణ సంఘం జాతీయ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

### కైరో కాంగ్రెస్ సదస్సుకు అపోలో వైద్యుని కథనాల ఎంపిక

ఆరిలోవ: ఈజిప్టు దేశం కైరో నగరంలో ఈ ఏడాది నవంబరులో జరగనున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామటాలజీ(సికోట్) వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రదర్శనకు హెల్త్‌సిటీలో అపోలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ రాసిన శాస్త్రీయ కథనాలు ఎంపికయ్యాయి. తాను పంపించిన వాటిలో నాలుగు శాస్త్రీయ కథనాలు ఎంపికైనట్లు ఇటీవల సికోట్ కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ నుంచి లేఖ వచ్చినట్లు ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ప్రదర్శించడానికి నవంబర్‌లో కైరో సదస్సుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

# వానప్రస్థ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం



వృద్ధులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అల్లు శంకరరావు యువసేన

మురళీనగర్: జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. శంకరరావు తిరుపతిలో ఉన్నందున అభిమానుల ఆధ్వర్యంలో పట్టాభిరెడ్డితోటలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్లు శంకరరావు యువసేన ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్, విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, శివాలయం బోర్డు చైర్మన్ ఎస్.వెంకటరమణ, వార్డు సీనియర్ నాయకులు పి.రవికుమార్, జె.వెంకటరావు, ఎస్.చంద్రశేఖర్, బి.శివరామప్రసాద్, సీహెచ్.శ్రీను, ఎల్.సుధాకర్, ఆర్.చిన్నారావు, జి.రామకృష్ణ, పి.నాగరాజు, కె.మున్నా, బి.శంకర్, హెచ్.అశోక్, పి.చైతన్య, సీహెచ్.నర్సింగ్, వి.కమలకుమారి, బి.శకుంతల, మంగ పాల్గొన్నారు.

# వాట్ ఏ వండర్.. ఇంగ్లిష్ లెర్నింగ్

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లబోధనకు అనూహ్య స్పందన
- కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు
- గవర్నమెంట్ స్కూళ్లలో పిల్లల్ని చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్న తల్లిదండ్రులు



ఎంవీడీఎం పాఠశాల



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు (ఫైల్)

జగదాంబ : ప్రభుత్వ పాలనలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి.. నూతన శకానికి నాంది పలికిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యా విధానంలో కూడా కొత్త ఒరవడి తీసుకొచ్చారు. దీంతో గతంలో ఈసురోమంటూ ఉండే ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కొత్తశోభతో అలరారుతున్నాయి. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను గొప్పగా తీర్చిదిద్ది ప్రైవేట్‌కు దీటుగా రూపొందిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు చూడని వారంతా ఇప్పుడు అక్కడ తమ పిల్లల్ని చేర్పించేందుకు పోటీ పడుతున్నారనంటే అతిశయోక్తి కాదు. ఉచితంగా పుస్తకాలు, స్కూలు బ్యాగులు, యూనిఫాం, రెండు జతలు బూట్లు, సాక్సులు అందజేస్తూ పిల్లలకు బడి పట్ల ఉత్సాహం కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఉన్నత చదువుల కోసం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం టీచర్లను నియమించారు. ఇలా సీఎం జగన్ తీసుకున్న అనేక చర్యలు ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల పదో తరగతిలో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణతే దానికి నిదర్శనమని చెప్పాలి. కేవలం చదువులే కాకుండా విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం కల్పించి రుచికరమైన, బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

**మొదట్లోనే సత్తా చాటిన ఎంవీడీఎం పాఠశాల**

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఎంవీడీఎం పాఠశాలలో సెంట్రల్ సిలబస్ ఇంగ్లీష్ మీడీఎం (సీబీఎస్‌సీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటి దశలోనే ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటి ప్రభుత్వ నిర్ణయం సరైనదే అని నిరూపించారు. దీంతో వార్డులో ఉన్న సెయింట్ ఎలోషియస్, సెయింట్ జోన్స్ స్కూళ్ల నుంచి విద్యార్థులు ఎంవీడీఎం పాఠశాలలో చేరేందుకు ఉత్సుకత చూపుతున్నారు.

### మళ్లీ బడికి పంపిస్తున్నాం..



మా అబ్బాయిని చదివించలేక బడి మానిపించేశాం. జగనన్న ప్రవేశ పెట్టిన విద్యా కానుకలో అమ్మ ఒడి నుంచి బడికి కావల్సిన పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్సులు ఇస్తుండడంతో మాపై భారం తగ్గింది. ఒక్క రూపాయి ఖర్చు లేకపోవడంతో మళ్లీ వాడిని బడికి పంపిస్తున్నాం.

–సూరాడ ఎల్లాజీ, 39వ వార్డు, ఫెర్రీరోడ్డు.

### కార్పొరేట్ పాఠశాలకు పంపలేదనే బాధ లేదు..



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధన మొదలు కావడంతో మా పిల్లలకు ఇంగ్లిష్ వస్తుంది. కార్పొరేట్ పాఠశాలకు పంపలేదనే బాధ లేదు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను ఇప్పుడు ఆంగ్ల బోధన అందుబాటులో ఉంది.

–రామోలు చిన్న, 39వ వార్డు, కన్వేయర్‌బెల్ట్, థామ్సన్‌స్ట్రీట్.

### పిల్లల చదువుకు బంగారుబాట..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నాడు-నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారా పిల్లల చదువుకు బంగారుబాట వేస్తోంది. సీబీఎస్‌సీ సిలబస్ కింద మొట్టమొదటి సారిగా ఎంవీడీఎం పాఠశాలను ఎంపిక చేసి విజయం సాధించారు. ఇప్పుడు వచ్చిన కొత్త విద్యా విధానం మరింత బాగుంది. ముఖ్యమంత్రి జగనన్న మన పిల్లల భవిష్యత్ కోసం ఇంటర్ వరకు వెనక్కి తిరిగి చూసుకోకుండా అన్నీ అందిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం కూడా జగనన్న చక్కటి పథకాలు అమలు చేస్తున్నారు.

–మహ్మద్ సాధిక్ 39వ వార్డు కార్పొరేటర్

# దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

సీతంపేట: లెట్స్ స్పీక్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం రామాటాకీస్ రోడ్‌లోని సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది రోగులను అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు శివకుమార్, శ్రీనివాసరావు, పీజీ వైద్యులు ప్రహర్ష, సాయి, శ్రీయ, కల్యాణి, నందిని, మౌనిక, భరణి తదితరులు పరీక్షించి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి అక్కడ చికిత్స నిర్వహించారు. వీలు కాని వారికి అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తమ బస్సుల్లో తీసుకువెళ్తామని నిర్వాహకులు తెలిపారు.